క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పురుషోత్తమ పట్నం, సుగాలీ కాలనీ, శాంతినగర్, భావనా రుషినగర్, మార్కెండేయ నగర్ ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నాదెండ్ల: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో స్వరూప రాణి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

శివనాగేంద్రమ్మకు మాజీమంత్రి నివాళులు

నాదెండ్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి మాతృమూర్తి శివనాగేంద్రమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి విడదల రజిని, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తూబాడులోని కోటిరెడ్డి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. పలువురు పార్టీ జిల్లా, మండల నాయకులు సంతాపం తెలిపారు.

నేటి చలో విజయవాడ జయప్రదం చేయండి

నరసరావుపేట: విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ పిలుపునిచ్చారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, జీఓ నం.77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు నెలకు రూ.3 వేలు మెస్ చార్జీలు పెంచి పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం మదర్‌థెరిస్సా అని డాక్టర్ సతీష్‌చంద్ర చెప్పారు. ఏపీ స్టేట్ ప్రైవేట్ కాంపౌండర్లు, నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ముందుగా రైతుబజార్ ఎదురుగా ఉన్న మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు, దేవరకొండ నాగేశ్వరరావు, బి.శ్రీనునాయక్, గుంజి బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాబు వినాశకర విధానాలు తిప్పికొట్టాలి

నరసరావుపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు వినాశకర ప్రైవేటీకరణ విధానాలను త్రిప్పికొట్టి పబ్లిక్ రంగాన్ని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు, అన్నీ ప్రతిపక్షాలు, అభ్యుదయ ప్రజా సంఘాలు సుదీర్ఘ పోరాటానికి సమాయత్తం కావాలని సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్ పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎందరో ఆంధ్రుల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ రెక్కలను విరిచి, కాళ్లు తెగ్గొట్టి ఇక ప్రైవేటు వారికి విసిరిపారేయటమే తరువాయిగా ఉన్న భీతావహ దుస్థితిని తెచ్చి, ఇంకా ఏమీ జరగలేదు అన్నట్లు బుకాయించడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి పరాకాష్ట అన్నారు. ఇదేవిధంగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నిర్మాణం తుది దశలో ఉన్న పది మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ, పేదలకు వైద్యాన్ని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి తెగబడిన బాబు విధానం కక్షపూరితంగా, ప్రజా వ్యతిరేకంగా, పీపీపీ పేరున తన బినామీ దారులకు ప్రైవేటు పెత్తందారులకు దోచిపెట్టే విధంగా ఉందన్నారు. ఇందుకు తగిన నిర్ణయాలను ఈ నెల 9న ఆయా పక్షాలు తీసుకోవాలని, లేనిచో చరిత్ర క్షమించదని అన్నారు.

వృద్ధ దంపతులకు చేయూత

నూజెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామం ఎస్సీ కాలనీలో తూమాటి నాగయ్య–పున్నమ్మ 70 సంవత్సరాల కల్గియున్న దంపతులు జీవనోపాధి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం అరుంధతీ సేవా ఫౌండేషన్ సారథ్యంలో 50 కేజీలు బియ్యం నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. గత 15 సంవత్సరాల నుంచి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను కూడా తమ వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపఅధ్యక్షులు గర్నెపూడి ఈశ్వరయ్య,తదితరులు పాల్గొన్నారు.

చిరుమామిళ్ళకు మరో కలికితురాయి

- 30 పడకల ఆసుపత్రికి నిధులు మంజూరు
- రూ.4.5 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- విరాళంగా మరో రూ.5 కోట్లు అందించిన నడికట్టు రామిరెడ్డి



చిరుమామిళ్ళలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి రామిరెడ్డితో చర్చిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయక్

నాదెండ్ల: చిరుమామిళ్ళ అభివృద్ధిలో మరో కలికితురాయి చేరనుంది. గ్రామంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి గ్రామానికి చెందిన విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి మూడెకరాల భూమిని విరాళంగా అందించారు. వైద్య ఆరోగ్య శాఖ ఈఈ నాయక్, డీఈ, ఏఈలు శుక్రవారం భూమిని పరిశీలించారు. దాత నడికట్టు రామిరెడ్డితో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేసింది. దాత నడికట్టు రామిరెడ్డి తన స్వంత నిధులు రూ.5 కోట్లు అందించనున్నారు. దీంతో రూ.9.50 కోట్లతో ఆసుపత్రి ఏర్పాటు కానుంది. ఈ ఆసుపత్రిలో సాధారణ వైద్య సేవలతో పాటూ ప్రసూతి, అత్యవసర వైద్య విభాగాలు ఏర్పాటు కానున్నాయి. 25 మంది వైద్యారోగ్య సిబ్బంది సేవలందించనున్నారు. ఈ ఆసుపత్రిని చిరుమామిళ్ళతో పాటూ చుట్టుప్రక్కల గ్రామస్తులు వినియోగించుకోనున్నారు. మూడెకరాల భూమి, రూ.5 కోట్లు విరాళం అందించనున్న రామిరెడ్డి పేరును ఆసుపత్రికి ఖరారు చేయనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. వచ్చే ఏడాది దసరా కల్లా నిర్మాణం పూర్తి చేసి సేవలందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదర్శ గ్రామంగా చిరుమామిళ్ళ

రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా చిరుమామిళ్ళ నిలుస్తున్నది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ప్రతి వీధికి సీసీ రోడ్డు, సైడు కాలువలు, వీధి లైట్లు, ప్రతి ఇంటికీ నీటి కుళాయి, కార్పొరేట్ స్థాయిని మరిపించేలా ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల ఉన్నాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన నడికట్టు రామిరెడ్డి తన స్వగ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు విశేషంగా కృషి చేశారు. తన స్వంత నిధులు వెచ్చించి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. తాజాగా రూ.50 లక్షల పూర్తి సొంత నిధులతో ఒలింపిక్ స్థాయి సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు.

తస్మై శ్రీ గురువేనమః

- పాఠశాలల్లో ఘనంగా గురుపూజా మహోత్సవాలు
- ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థిలోకం

యద్దపాడు: తిమ్మాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు. సర్వేపల్లి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వెంకటాద్రి నాయుడు, ఎలీషా, రీతారాజేశ్వరి, శివనాగరాజు, శివ నాగేశ్వరరావు, నెహ్రూబాబు, చాముండేశ్వరి, అబ్దుల్‌ఖాదర్, వేమారెడ్డి, శ్రీనివాస ప్రసాద్, విజయలక్ష్మి, ప్రవీణ, ఫర్జానా, విజయకుమారి, నాగేశ్వరరావు, శ్రీలత, మహాలక్ష్మి, శివకుమారి, శ్రీను, శివ సంధ్యలను సన్మానించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణకుమారి, ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, పావులూరి రాధా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు


కొండవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న షేక్ జున్నుసాహెబ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, డీఈవో చంద్రకళ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.



నరసరావుపేట పెన్షనర్స్ భవన్‌లో ..

17 మందికి ఉత్తమ పురస్కారాలు

చిలకలూరిపేట: పండితుడు, తత్వవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన 17మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. ఇందులో పట్టణంలోని ఎస్ఎస్‌జెడ్పీ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న షేక్ ఖాశింబుడే, రజకకాలనీలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన కె.ఆదిలక్ష్మి, ఆది ఆంధ్ర కాలనీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన కె.వేదమణి ఉన్నారు. చిలకలూరిపేట మండలానికి సంబంధించి పోతవరం కస్తూర్బా బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ షేక్ అఫ్రిఫూన్, బొప్పూడి జెడ్పీ హెచ్ఎస్ తెలుగు ఎస్ఏ ఆర్.రాఘవులు, పసుమర్రు జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఏ ఉన్న డి.పద్మావతి, యడవల్లి ఎంపీపీఎస్‌కు చెందిన వై.ఏడుకొండలు, గోపాళంవారిపాలెం ఎంపీపీఎస్‌కు చెందిన కె.సత్యనారాయణ ఉన్నారు. నాదెండ్ల మండలానికి సంబంధించి సాతులూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పి.వీరబ్రహ్మం, నాదెండ్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్ఎంఎల్ కాత్యాయణి, గణపవరం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన షేక్ ఖాదర్‌మస్తాన్, తుబాడు ఎంపీయూపీఎస్‌కు చెందిన షేక్ మొహమ్మద్ రఫీ ఉన్నారు. యడ్లపాడు మండలానికి సంబంధించిన లింగారావుపాలెం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పీఈటీ ఎం శౌరీలు, యడ్లపాడు పీఈటీ పి.పాల్‌సుధాకర్, ఉన్నవ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.స్నేహలత రెడ్డి, కొండవీడు జెడ్పీ హెచ్ఎస్‌కు చెందిన షేక్ జున్నూసాహెబ్, జగ్గాపురం ఎంపీపీఎస్‌కు చెందిన వీఎస్ మల్లేశ్వరచారి ఉన్నారు. వీరికి డీఈవో చంద్రకళ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు.



ఎంఏఎం కళాశాలలో తాడులాగే పోటీలో పాల్గొన్న అధ్యాపకులు



అవార్డు అందుకుంటున్న షేక్ జున్నుసాహెబ్

వేర్వేరు కళాశాలల్లో

నరసరావుపేట రూరల్: ఉపాధ్యాయుడు అనేది వృత్తి కాదని సామాజిక బాధ్యత అని ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరంలో..

నాదెండ్ల: గణపవరం రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలోని పెన్షనర్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు ఎస్.చంద్రశేఖర్‌రావును తోటి పెన్షనర్లు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు యలవర్తి భాస్కరరావు, కాట్రు కృష్ణారావు, తెలికేపల్లి హైమావతి, శివరామకృష్ణ, కోలా కోటేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థుల భవితకు పునాది ఉపాధ్యాయుడే

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. భారతరత్న డాక్టర్ సరేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్, డాక్టర్ ఏ.సరళాదేవి, డాక్టర్ రాజనాల వేణుమాధవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ భవన్‌లో...

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులుగా పనిచేసిన సంఘం సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ఆర్‌కె ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పచ్చల నాగభూషణం పాల్గొన్నారు.



ఎన్ఈసీలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి

కే–రిడ్జి పాఠశాలలో...

ఉపాధ్యాయ దినోత్సవాన్ని కే–రిడ్జి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని నలుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు జిల్లా కలెక్టరు, డీఈవో చేతుల మీదగా శుక్రవారం అందుకున్నారు. మండలంలోని ఎస్‌వీఎస్‌సి సీతారామపురం గ్రామం క్రాఫ్ట్ టీచరు సీఎస్ఆర్‌కె ప్రసాదు, రవ్వారం గ్రామం ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు తలపల శివ, కొండ్రురాయునిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు భూక్యా శ్రీను, తెల్లపాడు గ్రామం ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయరాలు సుజాతలు ప్రశంస పత్రాలు అందుకున్నారు.



ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో చంద్రకళ


విజేత కాన్సెప్ట్ స్కూల్లో

వినుకొండ: మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానవంతుడిగా తీర్చిదిద్దే క్రమంలో గురువుల పాత్ర ఎనలేనిదని విజేత కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ కావూరి సాయికుమార్, డైరెక్టర్ ఆవులమంద బ్రహ్మయ్యలు కొనియాడారు. తొలుత సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల గొప్పతనం గురించి కొనియాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.


కవి కరిముల్లాకు అవార్డు

వినుకొండ: మండలంలోని నాగులవరంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న కవి కరిముల్లాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రభుత్వం అందజేసింది. ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలో భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో అవార్డు అందుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందనలు



పి.గురుబాబు



వి.ఎలిజిబెత్

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన విద్యా ప్రదాతలు సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు ప్రశంస పత్రాలు అందజేయటం అభినందనీయమని ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితకుమారిలు అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టరు, డీఈవో చేతుల మీదగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల్లో సోషల్ సబ్జెక్టు బోధిస్తున్న ఉపాధ్యాయులు పి.గురుబాబు, వేల్పూరు గ్రామం బీసీ కాలనీలో ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయరాలు బి.ఎలిజిబెత్‌లు ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు తీసుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయనతో పాటు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డుపాటి విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, సిఆర్‌పిలు ఏలికా శ్రీనివాసరావు, కొండలు ఎంఆర్‌సీ సిబ్బంది లింగాల శ్రీహరి, తివిక్రమ్ ఉన్నారు.

రొంపిచర్లలో...



సన్మానం అందుకుంటున్న రవినాయక్

రొంపిచర్ల: మండలంలోని ఆరుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. అవార్డులకు ఎంపికైన వారిలో వి.రెడ్డిపాలెం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్, అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కె. హేమలత, గోగులపాడు పాఠశాలకు చెందిన ఇ. కోటయ్యస్వామి, సంతగుడిపాడు కేజీబీవీకి చెందిన పద్మావతి, గోగులపాడు ఏపి పాఠశాలకు చెందిన డి. ఖాశింవలి, విప్పర్ల ఎంపీపీఎస్‌కు చెందిన డి. సత్యనారాయణ ఉన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్‌లు, ఆయా గ్రామాల పెద్దలు, మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

డివిజన్ ఆఫీసు తరలిస్తే ఉద్యమిస్తాం

- హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- స్థానిక ఎమ్మెల్యే కూడా దృష్టిపెట్టాలని విజ్ఞప్తి

నరసరావుపేట: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ ఆఫీసును చిలకలూరిపేటకు తరలిస్తే వైఎస్సార్‌సీపీ తరపున ధర్నా చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక శాసనసభ్యులు విద్యుత్ సబ్‌డివిజన్‌ను చిలకలూరిపేటకు తరలించడానికి తక్షణమే అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం గత 30 ఏళ్ల నుంచి నరసరావుపేటలో ఉన్న విద్యుత్ సబ్ డివిజన్ ఆఫీసును చిలకలూరిపేటకు తరలించాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని, ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని, కూటమి ప్రభుత్వం ఈనెల 12న నిర్ణయం తీసుకోనున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో విద్యుత్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆఫీస్, కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఉన్నాయని, ఇక్కడి నుంచి సబ్‌డివిజన్ ఆఫీసును తీసుకెళ్లి చిలకలూరిపేటలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సబ్ డివిజన్‌లో భౌగోళికంగా దూరంగా ఉన్న రొంపిచర్ల, నకరికల్లు, ఈపూరు, శావల్యాపురం మండలాలు కలపటానికి ప్రయత్నం చేస్తున్నారని, ఈపూరు మండలం వాళ్లు నరసరావుపేట వచ్చి ఇక్కడి నుంచి చిలుకలూరిపేట వెళ్లి విద్యుత్ సమస్యలు చెప్పుకోవాల్సిన గత్యంతరం ఏర్పడుతుందన్నారు. నరసరావుపేట రూరల్ మండలం, నరసరావుపేట టౌన్ ఇక్కడే ఉంటాయని, రొంపిచర్ల మండలం మాత్రం చిలకలూరిపేట సబ్‌డివిజన్‌లో కలుపుతున్నారని అన్నారు. దీనికి వినుకొండ శాసనసభ్యులు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తంచేశారని, కానీ స్థానిక శాసనసభ్యులు కూడా ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. చిలకలూరిపేటకు అవసరమైతే ఆ ఏరియాకి సంబంధించి మండలాలు కలుపుకొని ఏర్పాటు చేసుకోవాలని, కానీ ఇక్కడి ఆఫీసు ఇక్కడే ఉంచాలని కోరారు. పార్టీ జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు గుజర్లపూడి ఆకాష్ కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అవార్డు గ్రహీతకు ఘనసన్మానం



శాంతి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ గౌరవ పురస్కారం అందుకున్న ఎఎంరెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆగస్టు 31వ తేదీన 14వ వరల్డ్ లీడర్స్ సమ్మిట్ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవుట్ స్టాండింగ్ లీడర్ అవార్డు ఇన్ లీడర్‌షిప్ అవార్డును శాంతి శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. విద్యారంగంలో అసాధారణ నాయకత్వ లక్షణాలు, ప్రగతిశీల ఆలోచనలు, సంస్థల ఉన్నతికి చేస్తున్న కృషికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో శాంతి శ్రీనివాసరెడ్డి అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థ పరిధిలోని ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విలువలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలతో ముడిపడి ఉండాలన్నారు. విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే స్థాయిలో తీర్చిదిద్దడమే ఎఎంరెడ్డి విద్యా సంస్థల లక్ష్యమని తెలిపారు.

ఘనంగా ప్రవక్త జన్మదినం



దువా చేస్తున్న మౌలానా షేక్ బాజీషహిద్

చిలకలూరిపేటటౌన్: ఇతరుల పట్ల దయ, కరుణ, న్యాయం, నిజాయితీతో వ్యవహరించాలన్న మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవులకు ఆచరణీయమని మౌలానా షేక్ బాజీషహిద్ చెప్పారు. మండలంలోని పసుమర్రు గ్రామంలోని చినమసీదు బజారులోని శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండాచెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మొహమ్మద్ ప్రవక్త (సఅసం) జన్మదినాన్ని ఈ మాసమంతా ముస్లింలు వాడవాడలా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చినమసీదు వీధిలోని ముస్లిం కుటుంబాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమిష్టిగా చేయడం ఐదో ఏటా నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. వివిధ పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగ సుందరంగా మండపంలో మొహమ్మద్ జీవిత విశేషాలను గురించి ఆయన బోధించి దువా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానికులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను షేక్ మస్తాన్‌షరీఫ్–నసీమా, అబ్దుల్‌రవుఫ్–గౌసియా, ఫర్మానుల్లా–సానియా, జాఫర్‌అలి–నాజీయ, సమీర్, సుక్లేన్‌వసీం, సయ్యద్ పీర్ పర్యవేక్షించారు.

సద్ది వితరణ ప్రారంభం



ఎమ్మెల్యే ప్రత్తిపాటి, బ్రహ్మం చౌదరిలను సన్మానిస్తున్న మండలనేని బ్రదర్స్

నాదెండ్ల: గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద తాత్కాలిక షెడ్డునిర్మించి అయ్యప్పస్వాములకు శుక్రవారం నుంచి సద్ది కార్యక్రమం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మండలనేని బ్రదర్స్ ఆధ్వర్యంలో 45 రోజులపాటూ నిత్యం 300 మందికి మధ్యాహ్నం సద్ది ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కమ్మ కార్పోరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి, నాయకులతో కలిసి ప్రారంభించారు. ముందుగా అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గురుస్వాములు తులం పూర్ణచంద్రరావు, సిద్దు హనుమంతరావు, చక్రవరం శివనారాయణరాజు పాల్గొన్నారు.

గిరిప్రదక్షిణకు ప్రత్యేకవాహనం...

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలం యాత్ర, గిరిప్రదక్షిణకు గ్రామం నుండి 50 మంది భక్తులతో ప్రత్యేక వాహనం ద్వారా శుక్రవారం తరలివెళ్ళారు. వీరు గత ఇరవై ఏళ్ళుగా ప్రతి ఏడాది అరుణాచలం గిరిప్రదక్షిణకు యాత్రను చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సత్తెనపల్లి: స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి ఆటో డ్రైవర్లకు జీవనోపాధిని కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సత్తెనపల్లి ఏరియా సమితి గౌరవ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అమరావతి ఆటో పాయింట్‌లో శుక్రవారం ఆటో యూనియన్ కరపత్రాలు ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ పోస్టులు రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ ఆఫీసుల్లో అటెండర్స్, ఆఫీస్ బాయ్స్‌గానూ, పోలీస్ హోంగార్డు ఉద్యోగాలు ఇచ్చి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రైవర్ల హక్కుల సాధనకు పోరాటాలు చేసి ప్రభుత్వాల కళ్లు తెరిపించాలన్నారు. డ్రైవర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్ మహబూబ్, డి.బాబు, ఏ.రమేష్, చిలక జిప్సను, శీను తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి బెడ్ వితరణ

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐసీయూ బెడ్‌ను వితరణ చేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు శుక్రవారం తెలిపారు. వేల్పూరు గ్రామానికి చెందిన కంచర్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులు తమ వంతు సహాయంగా రూ.15 వేలు విలువ చేసే బెడ్‌ను వితరణ చేసినట్లు తెలిపారు.